

# మూడో సీతకథ

బ్రాహ్మణ పిల్ల

– భువనచంద్ర



(గత సంచిక తరువాయి)

**పండిట్‌జీ.. పరమపదసోపానం**

మళ్ళీ స్కూళ్ళు తెరిచారు. సెలవుల్లో నేను చాలా పుస్తకాలు చదివాను. నాకు బాగా నచ్చిన రచయితలు విశ్వనాధసత్యనారాయణగారూ, కొడవటిగంటి కుటుంబరావుగారూ. ఇద్దరివీ విభిన్నధృవాలు. ‘చెలియలికట్ట‘ చదివాక నాకు అనిపించింది, అంత విప్లవాత్మకంగా విశ్వనాధవారు ఎలా వ్రాశారని. అదీ ఆకాలంలో. వేయిపడగలు చదివి రోజులపాటు ఆ నవలలోని పాత్రల్నే కలలు కన్నాను. రాత్రంతా కలల్లో ఆ పాత్రలే. ఇక పురాణాలైన గ్రంథమాలలోని ‘భగవంతుని పై పగ, నాస్తికధూమం‘ ఇలా వరసగా చదువుతుంటే పిచ్చెక్కింది. అసలా ‘పులిముగ్గు‘ ఊహ ఎలా వచ్చిందీ! మొదట్లో ఆయన బాణీ నారికేళపాకంలా అనిపించినా మా నాన్న సహాయం చెయ్యడంవల్ల అది కొంతకాలానికి కదళీపాకం, ఆ తరవాత ద్రాక్షాపాకం అయింది.

ఇహ కొడవటిగంటి వారివైతే ప్రతీ పుస్తకము, కథా కూడా చేతిలోని దీపమే. M.శేషాచలం&co ఎమెస్కోగా ప్రసిద్ధిచెందింది. పావలా కట్టి సభ్యురాల్నైనాను. ప్రతినెలా ‘పుస్తకప్రపంచం‘ ఫ్రీగా వచ్చేది. సంవత్సరాంతానికి కోరుకున్న పుస్తకాలు (కేట్‌లాగ్‌లోవి) ఉచిత పోస్టేజీతో ఇంటికొచ్చేవి.

మా నాన్న ఎంకరేజ్ చేసినట్టు బహుశా ఆ కాలంలో కూతుళ్ళని ఎవరూ ఎంకరేజ్ చెయ్యలేరేమో! రోజుకో గంట ఆయన నాతోనే నవల్స్‌ని బిగ్గరగా చదివించేవారు అలా చదవడంవల్ల స్వరం బాగుపడటమే కాక సభా పిరికితనం (స్టేజ్‌ఫియర్) కూడా పోతుందని చెప్పేవారు. అంతేకాదు సంభాషణలు (నవలలోని) పాత్రోచితంగా, సన్నివేశపరంగా చదవమనేవారు. ఆ గంటా మా అమ్మ కూడా నా ‘రీడింగ్‘ వినాల్సిందే. ఒక్కోసారి అమ్మని కూడా చదవమనేవారు.

ఇంట్లో ఉండే ముగ్గురం ఇలా కలిసి కూర్చుని చదువుకోవడం ఎంత బాగుండేదో. నిజంగా చదవడంలో నాకు మంచి అనుభవం వచ్చింది. ఎక్కడ ఎలా, ఎంత స్వరంతో ఏ ఎమోషన్‌ని పండించాలో బాగా తెలిసింది. స్కూల్లో జరిగే వక్తృత్వపు పోటీల్లో ప్రతిసారీ నాదే ఫస్టుప్రైజ్. కారణం, మా నాన్న నా చేత ‘చదివించడం‘లో తీసుకున్న జాగ్రత్తలు. సినిమాలు కూడా చూసేదాన్ని కానీ, మరీ అంత ఇంట్రెస్టుతో కాదు. అయితే, చిన్నప్పుడులా నేలలోంచి బెంచీకీ బెంచీమీంచి కుర్చీకీ దూకడం మర్యాద కాదుగదా!

"రచయితలకీ రచయిత్రులకీ తేడా ఏమిటీ?" ఇదీ మా క్లాసులో డిబేటు. "జండర్ సార్" అన్నది కమలకుమారి.

"ఆహా.! పెర్ఫెక్ట్ ఆన్సర్.. మోస్ట్ ఇంటలిజెంట్ గాళ్.. కొట్టండ్రా చప్పట్లు" అన్నారు PSNగారు. PSNగారంటే పి.సూర్యనారాయణగారు. మనిషి పొడుగుకాదు. తెల్లటి పంచె జుబ్బా. వయసేం పెద్దదికాదు. ముప్పై ఒకటో రెండో ఉండొచ్చు. కానీ ఎప్పుడూ తెల్లని గ్లాస్కో పంచలే. అదీగాక తాంబూల సేవనం. అందరం చప్పట్లు చరిచాం.. నవ్వుకుంటూ. కమలకుమారి మొహం పెనంలాగా తయారైంది. PSNగారు కొత్తగా వచ్చిన మాస్టారు.

"రచయిత్రుల రచనలు ఎక్కువగా కల్పనతో నిండివుంటాయిసార్. ఊహల్లోనే జీవిస్తారు" అన్నాడు కృష్ణారెడ్డి. (అతనే పెద్దయ్యాక ప్రొఫెసర్‌గా విజయవాడ లయోలా కాలేజీలో పనిచెయ్యడమే కాక ఎన్నో ఇంటర్నేషనల్ సెమినార్స్‌కి హాజరై గొప్పపేరు తెచ్చుకున్నాడు.)

"నేను ఒప్పుకోను సార్. కొందరు రచయిత్రులు కల్పనతో తమ రచనలను ముంచెత్తినా, ఒకరకమైన స్ఫూర్తిని మాత్రం పాఠకులకు కలగజేస్తున్నారు" వాదించింది సరస్వతి.

"అవునండీ.. అంతేకాదు స్త్రీ తన స్వతంత్రం కోసం ఎవరినీ దేబిరించాల్సిన పనిలేదనీ, తన కాళ్ళమీద తాను నిలబడే ప్రయత్నం చెయ్యాలనీ ముప్పాళ రంగనాయకమ్మ వంటి రచయిత్రులు తమ నవలలద్వారా కథలద్వారా పాఠకులకి బోధిస్తున్నారు. మగవారి అహంభావాన్ని అధికారాన్నీ తమ రచనల ద్వారా ఎండగడుతున్నారు. రచయితలు మాత్రం వారి పంథాలోంచి బయటకు రాలేకపోతున్నారు. కారణం వారికున్న సోషల్, ఎండ్ ఎకనమిక్ సెక్యూరిటీ" అన్నాడు ప్రసాద్.

"రచన యొక్క ఉద్దేశ్యం సంస్కరణ అయితే, రచనల ద్వారా సమాజాన్ని చాలా సంస్కరించవచ్చు. కానీ, రచన అనేది సంస్కరణ కోసమో, సమాజప్రగతి కోసమో ఏనాడూ కట్టుబడదు." క్లుప్తంగా అన్నాడు రాజు. అతనప్పుడప్పుడూ కవితల్ని రాయడమేకాదు, రష్యానించి వచ్చే 'సోవియట్‌లాండ్' పత్రికని చదివి ఆ విషయాలు అందరికీ చెబుతూ వుంటాడు. V.I. లెనిన్ గొప్పతనాన్ని సహ విద్యార్థులకి పరిచయం చేసింది అతనే.

దాదాపు గంటసేపు డిస్కషన్ జరిగినా నేను ఒక్కమాట కూడా మాట్లాడలేదు. "మాస్టారండీ.. మనక్లాసులో అందరికంటే పుస్తకాలు ఎక్కువగా చదివేది సీతేనండీ! అది నోరు విప్పట్లేదు" కంప్లైంట్‌గా అన్నది జయలక్ష్మి.

"అవునా? అయితే నీ అభిప్రాయం ఏమిటి అమ్మాయీ?" కుతూహలంగా అడిగారు PSN మాస్టారు. ఇక్కడో మాట చెప్పాలి. హైస్కూల్లో ఎనిమిది దాకా లేని అలవాటు ఎనిమిది దాటాక వచ్చింది. అదేమంటే ఫ్రెండ్స్‌నీ, టీచర్లనీ కూడా షార్ట్‌నేమ్స్‌తో పిలవడం.

మద్దిమత్తెన మధుసూదనరావుని MMR అనీ, నల్లమోతు పాండురంగ మూర్తిని NPRM అనీ, శీలా వెంకటేశ్వర్రావుని SVR అనీ, నండూరి జయలక్ష్మిని NJI అనీ షార్ట్‌గా పిలుచుకోవడం మొదలైందన్నమాట.

"సార్, స్త్రీలలో 'చదవాలి' అనే కాంక్షని పెంచింది నిస్సందేహంగా రచయిత్రులే. పత్రికలు, పేపర్లు, నవలలూ అన్నిట్నీ ఇవ్వాళ స్త్రీలు చదువుతున్నారు. ఆదరిస్తున్నారు. మాలతీ చందూర్, తెన్నేటి హేమలత, కె.రామలక్ష్మి, యద్దనపూడి సులోచనారాణి, కోడూరి కౌసల్యాదేవి, ద్వివేదుల విశాలాక్షి, రంగనాయకమ్మగారి సంగతి చెప్పక్కర్లేదు.... వీరందరూ పుస్తకాలనీ నవలలనీ చదవాలనే ఉత్సాహాన్ని ప్రజల్లో పెంపొందింపజేసినవారే. ఎటొచ్చీ స్త్రీలకి ప్రస్తుతం వున్న 'పరిధి' తక్కువ. అందుకే రచనల్లో చాలామటుకు, కుటుంబ, వివాహవ్యవస్థలకి పరిమితమవుతున్నాయి. రచయితలకి పరిధి ఎక్కువగనక అనేకానేక విషయాల్లోకి వారు దూరి, తమ రచనల్లో ఆ విషయాల్ని చిప్పించగలుగుతున్నారు. ఏమైనా ఒక్కటి నిజం, స్త్రీల వ్రతకథలు, పతివ్రతల కథలు 'ఇంటి ఇల్లాలికి వంట చిట్కాలు'లాంటి పరిధిలోంచి బయట పడి లోకాన్ని చదవడానికి ఇప్పటి స్త్రీలు ఎక్కువ ఇష్టపడుతున్నారన్నది ముమ్మాటికీ వాస్తవం." అన్నాను. జనాలు చప్పట్లు కొట్టారు. మాస్టారు నాలుగు మంచిమాటలు నాగురించి చెబుతూ వుండగానే 'బెల్' కొట్టారు.

ఒక విధంగా చెప్పాలంటే యీ చర్చ మా యింట్లో చాలారోజుల్నించీ సాగుతూనే వుంది. మా మూడో ఇంటి 'పద్మరాణి' యుద్దనపూడి నవల సెక్రటరీలోని 'రాజశేఖరం'లాంటి వాడ్నే చేసుకుంటానని పట్టుబట్టి కూర్చోవడంవల్ల 'రచయిత్రులు' యువతుల మనోభావాల్ని చెడగొడుతున్నారన్న వివాదం చాలా ఇళ్ళల్లో బయలుదేరింది. "అదేం? ఆడపిల్లలు ఉద్యోగం చేస్తామనీ, తమకాళ్ళమీద తాము నిలబడి స్త్రీ గౌరవాన్ని కాపాడతామని కూడా అంటున్నారుగా. ఆ పాజిటివ్ ఏంగిల్ ఎందుకు చూడరూ?" అని అన్నవారూ ఉన్నారు.

అసలీ చర్చ అవసరమా? అంటే, ముమ్మాటికీ అవసరమే. తిట్టినా కొట్టినా నోరుమూసుకుని చచ్చినట్టు పడివుండాల్సిన స్త్రీలల్లో, 'నేనూ మనిషినే.. ఎవరికీ బానిసనుకాను' అనే స్వతంత్రేచ్ఛ అప్పుడే మొలకెత్తుతోంది.

అయినా అప్పట్లో ఉద్యోగం చేసే స్త్రీలని వేళ్ళమీద లెక్కపెట్టొచ్చు. చేసినా, మాహా చేస్తే టీచర్లుగానో, నర్సులుగానో. అంతే. మా ఏరియాలో వీరమాచనేని విమలాదేవి(కమ్యూనిస్ట్) మోతే వేదకుమారి(కాంగ్రెస్) తప్ప రాజకీయాల్లో మహిళలే లేరు. వారి స్పీచ్ వింటుంటే మహోత్సాహంగా వుండేది. మైకు పట్టుకుని వాళ్ళు అనర్గళంగా మాట్లాడుతుంటే నేనూ వారంత గొప్పదాన్ని కావాలని కలలు కనేదాన్ని.

క్లాసునించి బయటికి వచ్చాక అనిపించింది, నేను వెలిబుచ్చిన భావాలన్నీ మా నాన్నవి. నాదంటూ ప్రత్యేకంగా, స్పష్టమైన అభిప్రాయం లేదు. అలా వుండాలంటే ఇకనించీ స్త్రీపురుష రచయితల మధ్య వైరుధ్యాన్ని గమనించి తీరాలని.

27 మే 1964. ఓ విషాదకరమైన రోజు. ఏ ఇంట్లో చూసినా విషాదమే. జనాలు గుంపులు గుంపులుగా కూర్చుని వున్నా మౌనం రాజ్యమేలింది. 'రేడియో' వున్నవాళ్ళు అందర్నీ ఇళ్ళల్లోకి రానిచ్చారు. మహామహుల సంతాపాలు, మధ్యమధ్యలో విషాద సంగీతం. కారణం భారత ప్రియతమ నాయకుడు, పిల్లలు ప్రేమగా పిలుచుకునే 'చాచా' నెహ్రూ పరమపదించారు. మా హెడ్మాస్టర్ పేరి రాజారావుగారి కళ్ళలో నీళ్ళు. మా నాన్నగారి కళ్ళవెంట కన్నీరు ధారగా కారింది. నెహ్రూగారి 'ఫోటోలు'వున్న వారందరూ ఇంటిముందు ఓ కుర్చీవేసి, ఆ ఫోటోని ఆ కుర్చీలోవుంచి, దండవేసి, దీపమూ అగరువత్తులు వెలిగించారు. బలవంతంగా కొట్లని 'మూయించే' దౌర్భాగ్యపు ఆనవాయితీ ఇంకా అప్పటికి రాలేదు. కానీ, చాలామంది దుకాణదారులు స్వచ్ఛందంగానే షాపులు మూసివేశారు. "నెహ్రూగారు పోయారు.. ఇక యీ దేశానికి దిక్కు ఎవరు?" ఏ నోట విన్నా ఇదే ప్రశ్న. ఆలిండియా రేడియో అవిశ్రాంతంగా ఆయన మృతులైన వార్తనీ, ఇతరుల సంతాప సందేశాల్నీ ప్రసారం చేస్తూనే ఉన్నది.

స్కూళ్ళకి ఆ రోజు సెలవిచ్చారు. నిజం చెబితే ఆయన ప్రధానమంత్రి అని మాత్రమే అప్పుడు మాకు తెలుసు. స్వాతంత్ర్యం కోసం పోరాడి సాధించిన మహానుభావుడనీ, మహాత్మునికి అత్యంత సన్నిహితుడనీ తెలుసు... అంతకు మించి ఏమీ తెలీదు. ప్రధానమంత్రీ, రాష్ట్రపతీ, రాజ్యసభ, లోక్‌సభ ఇవన్నీ వినడమేగానీ వారు ఏం చేస్తారో, ప్రభుత్వాన్ని ఎలానడుపుతారో ఏమీ తెలీని రోజులవి. ఓటు ఎవరికి వేశారో కూడా ధైర్యంగా బాహాటంగా ప్రజలు నోరారా చెప్పుకున్న రోజులవి.

సాయంత్రం మా నాన్నని అడిగాను. ఆయన వివరంగా నెహ్రూగారి జీవితచరిత్ర చెప్పారు. ఆయన కేవలం మనదేశానికే నాయకుడు కాదనీ, ప్రపంచశాంతికీ, ప్రపంచ ప్రగతికీ కృషిచేసిన మహానుభావుడనీ చాలా వివరంగా చెప్పాడు. ఇందిరాగాంధీ గురించీ, ఆమె భర్త ఫిరోజ్‌గాంధీ గురించి కూడా చెప్పారు..

ధనవంతుల ఇంట ఎంతోమంది జన్మించవచ్చు. కానీ ధనంకన్నా దేశం ముఖ్యమని భావించేవారెందరూ? ఒక రాజకీయ నాయకులు మరణించినట్టుగా నాడు ఎవరూ భావించలేదు. ఓ ఆత్మీయ బంధువు 'ఇంట్లో' మరణించినట్టు భావించి దుఃఖించారు. ప్రజాభిమానం అన్న పదానికి అర్థం అప్పుడు తెలిసింది.

ఆ తరవాత మా నాన్నని స్వాతంత్ర్య సమరయోధులగురించీ గొప్ప గొప్ప రాజకీయ నాయకుల గురించి చెప్పమని అడిగేదాన్ని. అంతేకాదు మా లైబ్రేరియన్‌గారిని అడిగి, స్వాతంత్ర్య సమరానికి సంబంధించిన పుస్తకాలు తీసుకుని చదివేదాన్ని. ఒక్కటి మాత్రం అర్థమయింది. గొప్పవాళ్ళు పుట్టరు వారి గొప్పదనం వెనుక కఠోర పరిశ్రమ వుండి తీరుతుంది. ధనం అనేదో, పదవి అనేదో కూడా వారసత్వంగా రావొచ్చు. గొప్పదనం మాత్రం వారసత్వంగా సంక్రమించే ఆస్తి అంతస్థుకాదు.

'పంచవర్ష ప్రణాళికా రథము సాగుతున్నదోయ్ తెలుగోడా'

'వచ్చిందీ..వచ్చిందీ.. నందికొండ నాగార్జున సాగరమొచ్చిందీ

ఆంధ్రుల పాలిటి కామధేనువై వచ్చిందీ'

ఇలాంటి ఉత్తేజభరితమైన పాటలన్నీ గ్రామఫోన్ రికార్డులుగా విడుదలై పిల్లల్ని చాలా ఆకర్షించేవి. గ్రామఫోన్ బండివాడ్ని (సినీ ఎడ్వర్‌టైజ్‌మెంట్) కాసేపు ఆపి, ఆ పాటల్ని రాసుకుని పాడుకునేవాళ్ళం. ఇక 'నమోవెంకటేశా', 'ఏడూకొండల స్వామీ ఎక్కడున్నావయ్యా', 'నమోవెంకటేశా, నమో తిరుమలేశా, యీశానమో శ్రీనివాసా', ఇవన్నీ మాకు కంఠోపాఠమే. ఆ రోజుల్లోనే రేడియోల్లో హిందీపాటలు కూడా వినేదాన్ని. అర్థంకాకపోయినా చాలా హాయిగా అనిపించేవి.

మళ్ళీ పరీక్షలు.. మళ్ళీ చదువులు.. మళ్ళీ ఫస్టు మార్కు రావాలనే పట్టుదలలు.. వీటన్నిటితో 5thఫాం కూడా గడిచిపోయింది. థర్డ్ నించి ఫిఫ్త్ వరకూ గొప్ప విశేషాలు ఏమీ జరగలేదు... నేను పెద్దమనిషినవడం తప్ప. అవన్నీ ఎందుకూ చెప్పడం!

మగపిల్లలు నన్ను ఆరాధనగానూ, అదో చూపుతోనూ చూడడం గమనించా. అయితే అదేమీ నాకు చికాకు పెట్టలేదుగానీ, ఆడపిల్లలు నావంక అసూయగానూ, అదో చెప్పలేని వైరుధ్యభావనతోనూ చూడటం మాత్రం నాకు చాలా బాధ, ఇబ్బందీ కూడా కలిగిస్తున్నాయి. ఓసారి రేఛల్ ఓ సినీనటి గురించి, "దాన్దేముంది దాని బొంద.. అంతా చిప్పల బాడీ మహత్యం" అన్నది. అది అన్నమాటకి అర్థం చాలారోజుల తరవాతగానీ తెలీలేదు. స్త్రీలు వేసుకునే 'లోదుస్తుల్లో' ఎన్నో మార్పులొచ్చాయనీ, అందంగా 'కనబడడానికి' అవెంతో దోహదం చేస్తాయనీ తెలిసి షాక్ తిన్నాను మా పెద్ద పుల్లేటికుర్రు అంత ఆధునికతను సంతరించుకోలేదు. 'బాటా' కంపెనీ మావూర్లోనూ ఓ బ్రాంచి తెరిచింది. అందరూ గుంపులు గుంపులుగా వెళ్ళి చూసొచ్చారుగానీ కొన్నవాళ్ళేరీ?

"ఆ. అవన్నీ చూడ్డానికేగానీ, మన్నుతాయా?" అని పెదవి విరిచేవాళ్ళు. నాకు నవ్వొచ్చేది. చిన్నప్పుడు హవాయి చెప్పులకోసం నేను చేసిన అల్లరి గుర్తుకొచ్చి.

ఓ రోజు స్కూలునించి నేను ఇంటికొచ్చేసరికి వాతావరణం గంభీరంగా వుంది. మా నాన్న మొహం కోపంతో ఎర్రబడివుంది. మా అమ్మ చాలా ముభావంగా వుంది. ఆ వాతావరణంలో చేసేదేముందీ. మాట్లాడకుండా వంటగదిలోకి వెళ్ళి ఉప్మాచేసి, మా నాన్నకి నేను పెట్టే 'వెండిప్లేటు'లో పెట్టి ఇచ్చా. మా అమ్మకి ఓ ప్లేటు ఇచ్చా.

"నువ్వు తెచ్చుకోలేదేం?" అన్నది మా అమ్మ. ఆ మాటలో ఏ ప్రత్యేకమైన ఆపేక్ష లేదు.

"తరవాత తింటా. అయినా నాకు ఆకల్లేదు." అన్నాను.

"ఆకల్లేనప్పుడు ఎవడు చెయ్యమన్నాడూ?" తింటూనే కోపంగా అన్నది మా అమ్మ.

"ఓ పక్క తింటూనే తిడతావేమిటే మాలక్ష్మి కూతురా.. మానాన్న మొహం చూస్తే అన్నం తిన్నట్టు లేదు. ఆకలి కూడా ఆయనకి తెలీదు. అందుకే చేశా." కావాలనే ఉడికించడానికి అన్నాను.

"హూ...మీ నాన్న కోసం చేసింది నాకెందుకూ?" విసరబోయి, ప్లేటుని నేలమీద కోపంగా పెట్టింది మా అమ్మ.

"ఆ చీర కూడా మా నాన్న కొన్నదేగా" పకపకా నవ్వి అన్నాను.

"ఏడిశావులే. వెధవ తెలివితేటలు. "చిరాగ్గా అని ప్లేటు తీసుకుంది. నేనన్నమాటకి నవ్వొచ్చినా ఆపుకుందన్నమాట. మాంఛి కాఫీ పెట్టి ఇద్దరికీ ఇచ్చి నేనూ తీసుకున్నా. కాఫీ పెట్టేప్పుడు చూశా. వాళ్ళిద్దరూ భోంచెయ్యలేదని అర్థమయింది.

"నాన్నా ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌గారిని బోర్డర్ గాంధీ అనీ, సర్ మార్టిన్ లూథర్ కింగ్‌ని అమెరికన్ గాంధీ అనీ అంటారు గదా.. వారి గురించి చెప్పవూ!" కావాలనే అడిగాను. మా నాన్నకి ఎప్పుడో తప్ప అసలు కోపంరాదు. ఆయన మైండ్ డైవర్ట్ చెయ్యాలంటే ఇలాంటి చర్చలే సాగించాలని నాకు తెలుసు. ఆయన చిన్నగా నవ్వి, "నువ్వు ఎందుకు అడుగుతున్నావో నాకు తెలుసు. అయినా అసలు విషయం ఏమంటే, మీ అమ్మ తరఫువాళ్ళు, అంటే ఆవిడ మేనమామగారట, ఆయన నీకో పెళ్ళిసంబంధం తెచ్చాడు. ఎట్టాగో SSLC(Secondary School Leaving Certificate) దాకా వచ్చింది కదా, ఇప్పుడో మాట అనేసుకుంటే, పరిక్షలు అవంగానే

చేసెయ్యవచ్చూ అని. నేను కాదన్నాను. మీ అమ్మేమో ఆడపిల్ల పెళ్ళి ఎంత తొందరగా చేస్తే అంతమంచిది అని మధ్యాహ్నం ఆయన వచ్చి వెళ్ళిన దగ్గర్నించీ వాదిస్తోంది. ఇప్పుడు చెప్పు. ఏం చెయ్యమంటావో?" అన్నాడు.

"ఛస్తే చేసుకోను. మొదట డిగ్రీకావాలి. తరవాత లాయర్ని అవ్వాలి. ఆ తరువాత జీవితంలో ఆర్థికంగా నా కాళ్ళమీద నేను నిలబడ్డప్పుడే పెళ్ళిచేసుకుంటా." ఖచ్చితంగా అన్నాను.

"ఎప్పుడు? తొంభైఏళ్ళు వచ్చాకా? ఎప్పుడు జరగాల్సిన ముచ్చట అప్పుడు జరగాలి. అంతేగానీ ఆ పద్మరాణీలాగా ముదిరిపోయాక నిన్నెవడు చేసుకుంటాడూ? నీ మంచి గురించి ఆలోచించేది ఆయనేకాదు. నేనూ ఆలోచిస్తా. నేనూ నీ తల్లినేగానీ పరాయిదాన్నా? నిన్ను పెళ్ళిచేసి బయటికి పంపడం నాకు సంతోషమా? ఒక్కగానొక్కపిల్లవి. నిన్ను పెళ్ళిచేసి పంపేరోజు నాగుండె పగిలిపోదా?" కళ్ళవెంట నీరు కారుస్తూ అన్నది మా అమ్మ.

"పరాయిదానివని నేనెట్టా అంటానూ? అసలు నిన్ను వదిలి నేను పోగలనా? అమ్మా, మీ మేనమామ నాకు సంబంధం తెచ్చాడు సరే. మరి అదే మహానుభావుడు నా మేనమామల కూతుళ్ళకి కూడా సంబంధాలు వెళ్ళి చెప్పగలడా?" సూటిగా అడిగా. మరుక్షణం ఆయన్ని బయటికి గెంటుతారని నాకు తెలుసు.

"సీతా.. ఎదటివాళ్ళు మనింటికొచ్చి చెప్పేది ఏదో బావుకోవడానికో లాభం పొందడానికో కాదు. ఎప్పుడూ ఎదుటివాళ్ళని చెడు దృష్టితో చూడకు. ఓ మంచి సంబంధం చెయ్యిదాటిపోతుందని మనింటికొచ్చి చెప్పాడుగానీ, యీ పెళ్ళి జరిగినందువల్ల ఆయనకేం లాభం? రెండొందలెకరాల మాగాణీ యాభై ఎకరాల మావిడి తోటా వున్నాయిట వాళ్ళకి. ఒక్కడే కొడుకు. లంకంత మేడా, పడవలాంటి కారూ వున్నాయిట. ఇక నగా నట్రా సంగతి చెప్పనక్కర్లేదుట. ఇక వయసైతే, నీకంటే అయిదేళ్ళు పెద్దవాడు. ఆ మాత్రం తేడా ఆడామగా మధ్యలో వుండి తీరాలి ఆ పిల్లవాడి బామ్మకి సుస్తీగా వుందనీ, పోయేలోగా మనవడి పెళ్ళి చూడాలనుకుంటోందనీ వాళ్ళు తొందరపడుతున్నారుగానీ, లేకపోతే వాళ్ళముందర మనమెంత? మీ నాన్నా నువ్వూ అన్నట్టుగా వూరుకున్నా మరో అయిదేళ్ళకో పదేళ్ళకో పెళ్ళిచేసుకోవాల్సిందేగా? అప్పుడీ సంబంధం దొరుకుతుందా? ఏవండీ, నా మేనమామ చెప్పిన సంబంధం అనేది పక్కనపెట్టండి, యీ సంబంధం మంచిదా కాదా అని ఆలోచించండి, అంతేకాదు, మన సీతని ఏలూర్లో ఆ కుర్రాడి తల్లితండ్రీ చూశారట. దాన్ని చూశాకే వాళ్ళు దాన్ని తమ యింటికోడలు కావాలని కోరుకుని మరీ నా మేనమామని మధ్యవర్తిగా పంపారుట. ఆ విషయం మీరూ విన్నారుగా. దాన్ని ఏరికోరి చేసుకుందామనుకున్నారు గనక, పెళ్ళిలో లోటుపాట్లు వున్నా, పెళ్ళయ్యాక సీత ప్రవర్తనలో చిన్న చిన్న లోటుపాట్లున్నా సర్దుకుపోతారేగానీ, వేధించి సాధించరుగా? నేను తప్పు మాట్లాడితే తన్నండి.. పడతాను. నేను ఆలోచించేదీ ఓ తల్లిగా అనిమాత్రం గుర్తించండి!" అన్నది మా అమ్మ.

నాకు తెలిసి ఇంత ప్రశాంతంగా, ఇంత కుదురుగా, ఇంత పెద్దవుపన్యాసం మా అమ్మ ఏనాడూ ఇవ్వలేదు. జీవితంలో మొదటిసారి నాకు అర్థమయింది.. తల్లి హృదయం బిడ్డకోసం ఎంత ఆలోచిస్తుందో, ఎన్ని విధాల మథనపడుతుందో. బహుశా మా నాన్నకి కూడా నాకోసం మా అమ్మ పడే తాపత్రయం, అర్థమైందనుకుంటాను, లేచి, "సరేలే.. నేనేమన్నాననీ.!. వెళ్ళి వంట సంగతి చూడు" అన్నాడు. కోర్టులో సంగతి వేరుగానీ, ఇంట్లో అంతకిమించి ఎవరైనా ఏం మాట్లాడగలరూ. ఆయన గొంతులో కోపంలేదు - చికాకులేదు - వాదన గెలిచి తీరాలన్న మూర్ఖత్వం లేదు. ఏ స్త్రీకన్నా అంతకిమించిన 'మాట రాయబారం' ఇంకేముంటుంది!

మా అమ్మతోబాటు నేనూ లేచా. "అమ్మా, మధ్యాహ్నం అన్నాన్ని కొంచెం పులుహోరగానూ కొంచెం పెరుగన్నంగానూ నువ్వు మార్చు. ఫ్రెష్‌గా చపాతీలూ కూరా నేను చేస్తాను. సేమ్యా పాయసం నేను నీకోసం చేసే స్పెషల్." అన్నాను. ప్రేమని చూపాలంటే ఓ చిన్న నవ్వు, ఓ చిన్న కౌగిలింత, కొంచెం ప్రేమగా స్వయంగా చేసిన ఆహారం.. అవి చాలు. బ్రహ్మాండమైన గిఫ్టులేమీ ఇవ్వక్కర్లా.

భోజనాలు అయ్యాక మా అమ్మ అన్నది, "సీతా.. నువ్వు గొప్పగా చదువుకోవాలనీ, అందరికంటే ఎంతో ఎత్తున వుండాలనీ నాకూ ఉందే కానీ పెద్దగా చదువుకోనిదాన్ని. అవతలి వాళ్ళు ఆస్తిపరులనీ, నిన్ను బాగా చూసుకుంటారనీ ఆశపడి నిన్ను పెళ్ళిచేసుకోమని అంటున్నానుగానీ నీ ఆశలకి అడ్డుపడాలని కాదే పోనీలే, రాసి పెట్టివున్న వాళ్ళే వస్తారు"

(ఇన్నేళ్ళ తరవాత ఆ మాటల్ని తలుచుకుంటుంటే నా కళ్ళల్లో నీళ్ళు తిరుగుతున్నాయి. ఆవిడ పెద్దగా చదువుకోని మాట వాస్తవమే. కానీ, నా బాగుకోసం, నేను సుఖంగా ఉండాలన్న ఆశతో ఎంత తపించిందో. అయినా నా ఇష్టానికే విలువిచ్చి తను రాజీపడటం అంత తేలికైన విషయం కాదు. ఈలోకంలో అతిచెడ్డవి మూడు 'కారాలు' అధికారం, అహంకారం, మమకారం,. ఆవిడకి నామీద అధికారమూ వుంది, మమకారమూ వుంది. తల్లినీ, పెద్దదాన్నీ అనే అహంకారమూ ఉండొచ్చు. కానీ, ఆ మూడింటినీ పక్కన పెట్టడం ఆవిడ ఆత్మ సంస్కారానికి నిదర్శనం.)

చిత్రం ఏమంటే, ఆయేడే మూడు సంబంధాలు వచ్చాయి నాకు. ఆ కాలంలో ఆడపిల్లకి పెళ్ళి చెయ్యాలంటే కాళ్ళూ, చెప్పులూ అరిగేలా తిరగాలి. కానీ నా విషయంలో మాత్రం రివర్సయింది. మూడు సంబంధాలకీ నేనే 'నో' చెప్పాను. మా అమ్మా నాన్నా కూడా చాలా మామూలుగా తీసుకున్నారు. జీవితంలో ఏనాడూ చదవనంతగా SSLC కోసం చదివాను. కారణం ఏదో సాధించాలనే తపన. నాకున్న ఏకైక ఆయుధం చదువు. లెక్కలు బోరుకొడితే హిందీ, ఇలా సబ్జక్ట్స్‌ని మార్చుతూ చదివాను. SSLC పరిక్షలయ్యాయి. వెయిటింగ్ ఫర్ రిజల్ట్స్.

*(మళ్ళీకలుద్దాం)*

Post your comments